సాక్షి
ప్రకాశం
శుక్రవారం । 22 । మార్చి । 2024



వై.పాలెంలో టీడీపీ డీలా

యర్రగొండపాలెం నియోజకవర్గంలో టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు తీరును ఆ పార్టీ శ్రేణులే తూర్పారబడుతున్నారు. బూదాల అజితారావు వర్గం వైఎస్సార్ సీపీకి జై కొడుతోంది. దీంతో అక్కడ టీడీపీ పూర్తిగా డీలాపడింది. - IIలో..



ప్రచార ప్రకటనలను క్షుణ్ణంగా పరిశీలించాలి

ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలలో ప్రచార ప్రకటనలను క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఎన్నికల అధికారులను ఆదేశించారు. - IIలో..


గరిష్టం/కనిష్టం
34/25

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉదయం పొగమంచు కురుస్తుంది. చల్లని గాలులు వీస్తాయి.

రంజాన్ వేళలు

శుక్రవారం - ఇఫ్తార్ : సా॥ 6.25
శనివారం - సహరీ : ఉ॥ 4.52



న్యూస్‌రీల్

ఎన్నికలను పకడ్బందీగా పర్యవేక్షించాలి



ఎన్నికల కమాండ్ కంట్రోల్ రూంను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఎన్నికలకు సంబంధించిన పర్యవేక్షణ పకడ్బందీగా ఉండాలని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ అధికారులకు సూచించారు. జిల్లా కమాండ్ కంట్రోల్ రూం నుంచి పక్కాగా పర్యవేక్షించాలని సూచించారు. ఎన్నికలకు సంబంధించి స్థానిక కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన జిల్లా కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను అసిస్టెంట్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్‌తో కలిసి గురువారం కలెక్టర్ పరిశీలించారు. సీ విజిల్, ఎక్స్‌పెండేచర్, స్వీప్, సువిధ సెల్, మీడియా మానిటరింగ్ తదితర విభాగాలను పరిశీలించారు. జిల్లా కమాండ్ కంట్రోల్ రూం పూర్తిస్థాయిలో పనిచేయడం ప్రారంభమైందన్నారు. ఇందులో సీ విజిల్, కంప్లెయింట్ సెల్, 1950 కాల్ సెంటర్, ఫీల్డ్ మానిటరింగ్ యూనిట్, ఎంసీసీ, ఎక్స్‌పెండేచర్ మానిటరింగ్, అనుమతులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ తదితర విభాగాలు ఉంటాయని వివరించారు. వాటికి సంబంధించి 14 మంది నోడల్ అధికారులను నియమించామన్నారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి పటిష్టంగా అమలు చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. సీ విజిల్ యాప్‌లో మోడల్ కోడ్ ఉల్లంఘనపై ఫిర్యాదులు పంపవచ్చన్నారు. పార్టీలకు చెందిన వారు మద్యం, నగదు, బహుమతులు పంపిణీ చేస్తే లైవ్ ఫొటోలు, వీడియోల ద్వారా యాప్‌లో ప్రజలు ఫిర్యాదు చేయవచ్చన్నారు. యాప్‌లో పెట్టిన ఫిర్యాదులను 100 నిమిషాల్లో పరిష్కరించడం జరుగుతుందన్నారు. దీంతో పాటు 1950 కాల్ సెంటర్ నంబర్‌కు కూడా ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఇప్పటి వరకు వివిధ అంశాలపై 56 ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఈ ఫిర్యాదులను సరాసరి 100 నిమిషాల్లో పరిష్కరించామన్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల ప్రచారాలకు సంబంధించి అన్ని అనుమతులు సింగిల్ డెస్క్‌లో పొందేలా సువిధ వెబ్‌పోర్టల్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రాజకీయ పార్టీలు సువిధ పోర్టల్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉద్యోగస్తులు రాజకీయ ప్రచారాల్లో పాల్గొంటున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని కలెక్టర్ అన్నారు. కంట్రోల్ రూం పరిశీలనలో కలెక్టర్ వెంట డ్వామా పీడీ అర్జున్ రావు, ఎంప్లాయిమెంట్ అధికారి భరద్వాజ్, కలెక్టరేట్ ఏఓ శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

వైఎస్సార్ సీపీలో ముగ్గురికి పదవులు

ఒంగోలు: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అనుబంధ విభాగాలలో జిల్లా నుంచి ముగ్గురికి అవకాశం కల్పించినట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో పేర్కొంది. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా సయ్యద్ అబ్దుల్, సంయుక్త కార్యదర్శిగా షేక్ జానీబాషాను నియమించారు. వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా షేక్ అల్లాభక్షును నియమించారు.

నేడు ఏకేయూలో ప్లేస్‌మెంట్ డ్రైవ్

ఒంగోలు: స్థానిక ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయంలో శుక్రవారం ప్లేస్‌మెంట్స్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు ఏకేయూ ప్లేస్‌మెంట్స్ ఆఫీసర్ డాక్టర్ ఐ.దేవీవరప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు వీసీ మారెడ్డి అంజిరెడ్డి లాంఛనంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని, రిజిస్ట్రార్ బి.హరిబాబు ప్లేస్‌మెంట్స్ డ్రైవ్ 2024కు హాజరయ్యే అభ్యర్థులకు సలహాలు, సూచనలు అందిస్తారని అన్నారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా యూనివర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.రాజమోహన్, చెన్నై నగరానికి చెందిన లూమినా డేటామేటిక్స్ కంపెనీ హెచ్ఆర్ మేనేజర్ పాట్రిక్ ఫిలిప్ తదితరులు హాజరవుతారన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయంచే గుర్తించిన ఎంబీఏ కాలేజీల్లో ఫైనలియర్ చదువుతున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఎండాకాలంలో మామిడి పండ్లు తినేద్దాం అనుకునే వారికి ఇది చేదు వార్తే.. ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో పూత, పిందె రాలిపోతున్నాయి. దిగుబడి భారీగా తగ్గే అవకాశాలున్నాయి. ఫలితంగా మార్కెట్లో మధుర ఫలం ప్రియం కానుంది. మేలైన యాజమాన్య, సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా ఆశించినంత దిగుబడులు సాధించవచ్చని ఉద్యానవనశాఖ అధికారులు సూచిస్తున్నారు.



పూత దశలో ఉన్న మామిడి తోట

ఎగుమతులతోనే లాభాలు



మామిడి నాణ్యత బాగుంటే మంచి రేటు లభిస్తుంది. కాయల ఎగుమతులు అనువుగా ఉంటే రైతులకు లాభాలు వస్తాయి. ఈ సంవత్సరం తుఫాన్ వలన పూత కొంత లేటవుతుంది. సకాలంలో సస్యరక్షణ, పంట నాణ్యతపై దృష్టి సారిస్తే లాభాలు ఆర్జించవచ్చు.

– వై.గోపీచంద్, జిల్లా ఉద్యానవన శాఖాధికారి, ఒంగోలు

పూతే బంగారమాయే..!

- దిగుబడి తగ్గనున్న మధుర ఫలం
- ప్రియం కానున్న మామిడి
- ఉమ్మడి జిల్లాలో 18 వేల ఎకరాల్లో సాగు
- ప్రతికూల వాతావరణ పరిస్థితులతో రాలిపోతున్న పూత, పిందె
- మేలైన యాజమాన్య పద్ధతులతో రక్షణ



మామిడి తోట



దర్శి నియోజకవర్గంలో పూతను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యానవన శాఖాధికారి గోపీచంద్

ఒంగోలు సెంట్రల్:

ఫలరాజుగా పేరొందిన మామిడి సాగుకు ఈ ఏడాది గడ్డు పరిస్థితులు ఎదురుకానున్నాయి. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో సుమారు 18 వేల ఎకరాల్లో పంట సాగుచేస్తున్నారు. అందులో అధికంగా ఉలవపాడు ఉద్యానవనశాఖ పరిధిలో 12 వేల ఎకరాల్లో సాగవుతోంది. మిగిలిన ఆరు వేల ఎకరాలు దర్శి, సింగరాయకొండ, జరుగుమల్లి, గిద్దలూరు, బేస్తవారిపేట, మార్కాపురం ప్రాంతాల్లో పండిస్తున్నారు. ప్రతి ఏడాది నవంబర్, డిసెంబర్ నెలల్లో పూత రావాలి. కానీ, ఈ ఏడాది రాత్రి వేళ ఉష్ణోగ్రతల్లో మార్పు, మంచు పడకపోవడం వలన పూత ఆలస్యమైంది. అలాగే, నవంబర్ నెలలో తుఫాన్ రావడంతో పూతలు జనవరి తర్వాత ప్రారంభమయ్యాయి. అది కూడా కేవలం 50 నుంచి 60 శాతం మాత్రమే వచ్చాయి. దీంతో పిందెలు తక్కువగా వచ్చాయి. ఫలితంగా ఈ ఏడాది దిగుబడి తగ్గనుంది. ఏటా మార్చి నెలాఖరుకు మామిడికాయలు అందుబాటులోకి వచ్చేవి. కానీ, ఈ ఏడాది ఇంకా పిందె దశలోనే ఉన్నాయి. ఏప్రిల్ చివరకు ఈ ఏడాది కాయలు వచ్చే అవకాశం ఉంది. ప్రతి ఏడాది సుమారు 80 నుంచి 90 వేల టన్నుల కాయలు ఉండేవి. కానీ, ఈ ఏడాది కేవలం 40 నుంచి 50 వేల టన్నులు మాత్రమే కాయలు వచ్చే అవకాశం ఉందని ఉద్యానవన శాస్త్రవేత్తలు, రైతులు తెలిపారు. దీంతో ఈ ఏడాది మామిడి కాయల రేట్లు అధికంగా ఉంటాయని రైతులు అంటున్నారు. దీనికితోడు రైతులు మామిడి సాగులో నాణ్యత కోసం కాయలకు కవర్లు కడుతున్నారు. లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేస్తున్నారు. కాయల్లో మచ్చలు, పురుగులు రాకుండా శాస్త్రవేత్తల సహకారంతో మందులు పిచికారీ చేస్తున్నారు. నాణ్యత అధికంగా ఉన్న కాయలు అధికరేటు పలికే అవకాశం ఉంది. ఈ ఏడాది మామిడి ప్రియులకు మాత్రం ఇది ఇబ్బంది కలిగించే అంశం. ఫలరాజుగా పేరొందిన మామిడి తినాలంటే ప్రియం అవడంతో పాటు తక్కువ కాయలు తినే అవకాశం ఉంది.

సస్యరక్షణ ఇలా...

ప్రస్తుతం మామిడి సాగు పూత, పిందె దశలో ఉంది. ఈ దశలో 15 రోజులకు ఒకసారి చెట్లకు క్రమం తప్పకుండా నీరు అందించడం ద్వారా పిందె రాలడం ఆగిపోతుంది. కాయ పెరుగుదలకు దోహదపడుతుంది. సైకో సిల్ 1–2 మి.లీను లీటరు నీటికి కలిపి పది రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేస్తే పూత వచ్చేందుకు తోడ్పడుతుంది. మొగ్గ ప్రారంభించిన తర్వాత పిందెలు ఏర్పడేందుకు బోరాన్ 2 గ్రాములను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. తామర పురుగుల నివారణ పద్ధతులు చేపట్టాలి. కలుపు మొక్కలు తొలగించడం ద్వారా తామర పురుగుల ఉధృతి తగ్గించుకోవచ్చు. నీలి రంగు జిగురు అట్టల ఏర్పాటు, వేప ఆధారిత సమ్మేళనాలతో పిచికారీ చేయడం వలన తామర పురుగులను నివారించవచ్చు. నాలుగు కిలోల మోటార్ రైజియంను ఒక క్వింటా పశువుల ఎరువుతో కలిపి చెట్టుపాదలో నాలుగు కిలోలు వెయ్యాలి. 2.25 మి.లీ గానుగ సబ్బు ద్రావణంను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పిందె రాలుడు, తెగులు నివారణకు కాప్టాన్ లేదా కవచ్ లేదా అంట్రకాల్ పిచికారీ చేసుకోవాలి. హార్మోన్ లోపం నివారణకు ప్లానోఫిక్స్ మిల్లీ లీటరును 4.5 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. గూడు పురుగు, తేనె మంచు పురుగులు, కాండం తొలుచు పురుగుల నివారణ పద్ధతులు చేపట్టాలి. పిందెలను గీకి రసాన్ని పీల్చడాన్ని గుర్తిస్తే తామర పురుగు ఆశించినట్లు నిర్ధారించుకోవాలి. పిందెల రసం పీల్చడం వలన మంగు ఏర్పడుతుంది. నివారణకు డెమోక్రాన్ లేదా రీజెంట్ లేదా థియామెథోక్సామ్ పిచికారీ చేసుకోవాలి. పండు ఈగ నివారణ పద్ధతులు కచ్చితంగా పాటించాలి. ఇది భయంకరమైన తెగులు. అన్ని పండ్లు, కొన్ని కూరగాయల జాతికి ఇది సోకుతుంది. కాయలకు గుడ్లు పెట్టి ఆ పురుగులు కాయలోనే పెరిగి కాయలు రాలిపోతాయి. ఈ పండు ఈగ నివారణకు నూజివీడు మామిడి పరిశోధన స్థానంలో లభించే లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవడం ఉత్తమం. రైతులు ప్రతి కాయను కాపాడుకోవాలి. కాయలకు కవర్లు తగిలించడం ద్వారా కాయ నాణ్యత బాగుంటుంది. అదనపు ఆదాయం లభిస్తుంది. ఫ్రూట్ కవర్ల వినియోగం వలన అయ్యే ఖర్చు చాలా తక్కువ.







సంతనూతలపాడులోని గోడలపై గురువారం కూడా ఉన్న టీడీపీ పెయింటింగ్‌లు

ఎన్నికల అధికారుల అత్యుత్సాహం

- వైఎస్సార్ సీపీ రంగులు, జెండాలు తొలగించి పొత్తు పార్టీలవి వదిలేసిన వైనం
- రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు లేఖ పంపిన సంతనూతలపాడు ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్



సీపీఎం పోల్, గుర్తు, జెండా



జనసేన పార్టీ ఫ్లెక్సీలు, జెండాలు

చీమకుర్తి: సంతనూతలపాడు మండలంలోని ఎన్నికల అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు మండలంలో వైఎస్సార్ సీపీకి చెందిన రంగులు, జెండాలు, గుర్తులు తొలగించారు. కానీ, పొత్తు పార్టీలైన టీడీపీ, జనసేనతో పాటు సీపీఎంకు చెందిన రంగులు, గుర్తులు, జెండాలు తొలగించలేదు. వాటి తొలగింపుపై కనీసం శ్రద్ధ కూడా చూపించలేదు. దీనిపై సంతనూతలపాడు ఎంపీపీ బీ విజయ, జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, సర్పంచ్ దర్శి నాగమణి, స్థానిక ప్రజాప్రతినిధులు రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు లేఖ రాశారు. సంతనూతలపాడు మండలంలోని పలు ప్రాంతాల్లో టీడీపీ, జనసేన, సీపీఎం పార్టీల గుర్తులు, జెండాలు, రంగుల ఫొటోలను గురువారం మీడియాకు వారు చూపించారు. ఎన్నికల కమిషనర్‌కు రాసిన లేఖను కూడా మీడియాకు విడుదల చేశారు. ఎన్నికల కోడ్ వచ్చిన రోజు నుంచే గోడలు, ప్రభుత్వ భవనాలపై ఉన్న వైఎస్సార్ సీపీ రంగులు తొలగించిన అధికారులు.. ఆ పార్టీ నాయకులపై కూడా ఒత్తిడి తీసుకొచ్చారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అదే సమయంలో టీడీపీ, జనసేనకు చెందిన పార్టీ రంగులు, గుర్తులను తొలగించకుండా ఉద్దేశపూర్వకంగా వదిలేశారని ఫిర్యాదు చేశారు. ఎన్నికల కోడ్ వచ్చి గురువారం నాటికి ఆరు రోజులైనా ఇంకా వాటిని తొలగించకుండా అధికారులు ప్రదర్శిస్తున్న నిర్లక్ష్య వైఖరిపై కమిషనర్‌కు లేఖ రాసినట్లు ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్ వివరించారు. దీనిపై సంతనూతలపాడు ఎంపీడీఓ శ్రీహరిని ఫోన్‌లో వివరణ కోరడానికి సాక్షి ప్రయత్నించగా.. ఆయన అందుబాటులోకి రాలేదు.



వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డితో కనిగిరి మాజీ ఎమ్మెల్యే కదిరి బాబూరావు గురువారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. మర్యాదపూర్వకంగా కలిసి సీఎంను సన్మానించారు.

జగన్‌తోనే జనరంజక పాలన

- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి ఆదిమూలపు సురేష్



ఇంటింటికి వెళ్లి ప్రజలను పలకరిస్తున్న మంత్రి సురేష్

మర్రిపూడి: రాష్ట్రంలో ఐదేళ్ల పాటు జనరంజక పాలన అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. మండలంలోని అయ్యప్పరాజుపాలెం, ధర్మవరం పంచాయతీలలో గురువారం పల్లెపల్లెకు సురేష్ అన్న సిద్ధం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమ పథకాలన్నీ సజావుగా ఇలాగే అమలు జరగాలంటే జగనన్నను మళ్లీ సీఎంగా గెలిపించుకోవాలని చెప్పారు. కుల, మత, పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కు దక్కుతుందన్నారు. రాష్ట్రంలో మహిళల పేరుతో ఇంటి పట్టాలిచ్చి గృహాలు నిర్మించి మహిళా సాధికారతకు సీఎం తోడ్పాటు అందించారని చెప్పారు. కొండపి నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసేందుకు తనను, ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. అవ్వాతాతలకు ఇంటింటికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి దేశంలోనే సీఎం వైఎస్ జగనన్న ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. జగనన్న ఆదేశాల మేరకు సైనికుడిగా కొండపి నియోజకవర్గానికి వచ్చానని, ఆశీర్వదించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అండగా నిలిచేది కేవలం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని అన్నారు. ముందుగా అయ్యప్పరాజుపాలెం వైఎస్సార్ సీపీ శ్రేణులు మంత్రి సురేష్‌కు మేళతాళాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు దొద్దాలి మల్లికార్జున్, వైస్ ఎంపీపీ గుట్లపల్లి మాధవి, మండల మాజీ అధ్యక్షుడు బోదా రమణారెడ్డి, మర్రిపూడి, చిమట సొసైటీ చైర్మన్లు బీవీ భాస్కర్‌రెడ్డి, మాకినేని వెంకటరావు, నాయకులు మాచేపల్లి నాగయ్య, ఇనుకొల్లు సుబ్బారెడ్డి, ఇనుకొల్లు మాదిరెడ్డి, గుట్లపల్లి కొండలరావు, నారాయణరెడ్డి, చెన్నపనాయుడు, మాకినేని రమణయ్య, మెల్లల ప్రభాకర్‌రెడ్డి, అరికేపల్లి కోటేశ్వరరావు, నాసరరెడ్డి, గోపిరెడ్డి గోపాల్‌రెడ్డి, కృష్ణమూర్తి, హరిబాబు, సర్పంచిల సంఘం అధ్యక్షుడు కదిరి భాస్కర్, సర్పంచిలు గంగిరెడ్డి రమణారెడ్డి, యాళ్ల రాణి హనుమంతరావు, గార్లపేట, జువ్విగుంట ఎంపీటీసీలు ఏ కొండారెడ్డి, కె.బ్రహ్మరెడ్డి, కో ఆప్షన్‌మెంబర్ కొండ్రు ఇజ్రాయేల్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు చూసి ఓటేయండి



చీమకుర్తిలో కూరగాయల బండి వద్ద ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి మేరుగు నాగార్జున

- సంతనూతలపాడు ఎమ్మెల్యేగా గెలిపించండి
- మంత్రి మేరుగు నాగార్జున
- చీమకుర్తి అర్బన్, రూరల్ ప్రాంతాల్లో సుడిగాలి పర్యటన

చీమకుర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఐదేళ్లుగా నిరంతరం అందించిన సంక్షేమ పథకాలు చూసి వైఎస్సార్ సీపీ ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని ఆ పార్టీ సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జున ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు చీమకుర్తి రూరల్ పరిధిలోని ఏలూరివారిపాలెం, మువ్వవారిపాలెం, గుడిపూడివారిపాలెం, మర్రిపాలెం, గోనుగుంట, లక్ష్మీపురం గ్రామాల్లో పార్టీ స్థానిక నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాత్రి చీమకుర్తి మున్సిపాలిటీలోని 3, 5, 6 వార్డుల పరిధిలో గల చినరాస్తారోడ్డు, వీవర్స్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ఓటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ సంతనూతలపాడు నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ తరఫున పోటీచేస్తున్న తనను మంచి మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులు నిరంతరం పొందాలంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ రెండోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని తెలిపారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని భరోసా ఇచ్చారు. ప్రచారంలో భాగంగా కూరగాయల బండ్లు, కొబ్బరికాయల వ్యాపారులతో పాటు స్టేట్‌బ్యాంక్‌లోని అధికారులు, రోడ్ల పక్కన చిరువ్యాపారాలు చేసుకునే ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. ప్రజల నుంచి కూడా మంత్రి ప్రచారానికి విశేష స్పందన లభించింది. పార్టీ శ్రేణులు అడుగడుగునా ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, చీమకుర్తి మున్సిపల్ చైర్‌పర్సన్ గోపురపు రాజ్యలక్ష్మి, సొసైటీ ప్రెసిడెంట్ బొడ్డు కోటేశ్వరరావు, ఎంపీటీసీ తన్నీరు శ్రీనివాసరావు, సర్పంచ్ ఏలూరి శ్రీలక్ష్మి, ఏలూరి సురేష్, పార్టీ నాయకులు దాసరి లక్ష్మీనారాయణ, కుంచాల రాంబాబు, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ బాపతు వెంకటరెడ్డి, కౌన్సిలర్లు పాటిబండ్ల గంగయ్య, బీమన వెంకటరావు, సోమా శేషాద్రి, స్థానికులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ మృతి

త్రిపురాంతకం: ఇటుక లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడి డ్రైవర్ మృతి చెందాడు. ఈ సంఘటన త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయ సమీపంలో గురువారం జరిగింది. స్థానికులు వివరాల ప్రకారం..మండల పరిధిలో రాజుపాలెం గ్రామానికి చెందిన గంగపాని సింహాద్రి(23) చెరువులో ఇటుకల బట్టి నుంచి ట్రాక్టర్ ఇటుకలను లోడు చేసుకొని వస్తున్న సమయంలో రహదారిలో అదుపుతప్పి బోల్తా పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలిస్తుండగా సింహాద్రి మార్గమధ్యంలో మృతిచెందాడు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


పెద్దారవీడు: రోడ్డుపై వెళుతున్న వ్యక్తిని ఆటో ఢీకొట్టడంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని సానికవరం బస్టాండ్ వద్ద గురువారం సాయంత్రం జరిగింది. వివరాల్లోకి వెళితే.. దోర్నాల నుంచి హనుమాన్‌జంక్షన్‌కుంటకు ఆటో వెళుతుండగా కర్నూల్–గుంటూరు రహదారిలో అడ్డంగా నడుచుకుంటూ గ్రామానికి చెందిన పోలెబోయిన మల్లయ్య (60) ఇంటికి వెళ్తున్న సమయంలో ఆటో ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం భోజన పథకంలో వంట ఏజెన్సీగా పనిచేస్తున్నాడు. ఇంటికి పెద్దదిక్కును కోల్పోయామని కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మృతునికి భార్య, పిల్లలు ఉన్నారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరి అరెస్టు


కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై

అర్ధవీడు(కంభం): మండలంలోని బొమ్మిలింగంలో హత్యాయత్నం కేసులో నిందితులను వారం తిరగకుండానే పోలీసులు అరెస్టు చేశారు. కేసు వివరాలను ఎస్సై అనిత గురువారం వెల్లడించారు. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన గోదేశి రాజేంద్రప్రసాద్ ఇంట్లో నిద్రిస్తుండగా అతనిపై కత్తితో దాడి చేయడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. నిందితుల కోసం పోలీసులు విస్తృతంగా గాలించి గురువారం ఉదయం మడతనపల్లి రమణయ్య, అతనికి సహకరించిన ఆదినారాయణరెడ్డిని అరెస్టు చేసి రిమాండ్ తరలించారు.

వైపాలెంలో టీడీపీ డీలా



- ఎరిక్షన్‌బాబు వైఖరిని తూర్పారబడుతున్న టీడీపీ శ్రేణులు
- టీడీపీ కార్యకర్తలకే కండువాలు కప్పడంపై విస్మయం
- వైఎస్సార్ సీపీకి జైకొడుతున్న బూదాల అజితారావు వర్గం
- ఫలించని మాగుంట బుజ్జగింపులు
- మౌనం వహించిన సీనియర్ నేత మన్నే రవీంద్ర

యర్రగొండపాలెం: పచ్చ జెండాలు మోసి అధినాయకుల నిర్లక్ష్యానికి గురై విసిగి వేసారిన తెలుగు తమ్ముళ్లు టీడీపీని వీడి భారీ ఎత్తున వైఎస్సార్ సీపీలో చేరుతున్నారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమ పార్టీ కార్యకర్తలు, నాయకులకు ఇస్తున్న ప్రాముఖ్యత, ప్రోత్సాహం.. సీఎంగా గత ఐదేళ్ల కాలంలో పార్టీలకు అతీతంగా రాష్ట్రంలోని పేదలందరికీ సంక్షేమ పథకాలు అందేలా తీసుకున్న చర్యలు, గ్రామ స్థాయి కార్యకర్తలను అక్కున చేర్చుకుంటున్న తీరుకు ఆకర్షితులై టీడీపీ శ్రేణులు స్వచ్ఛందంగా ఆ పార్టీలో చేరుతున్నారు. ఈ మేరకు మంగళవారం 50 కుటుంబాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలకు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానం పలికారు. ఇంకా భారీ సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరేందుకు సిద్ధమవుతున్నారు.

సీనియర్లకేది గౌరవం?

నియోజకవర్గంలో తనకంటు ఒక వర్గాన్ని ఏర్పాటు చేసుకొని రెండు పర్యాయాలు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసి ఓటమి చవిచూసిన బూదాల అజితారావుకు రానున్న ఎన్నికల్లో టికెట్ కేటాయించేందుకు ఆ పార్టీ అధినేత చంద్రబాబు సుముఖత చూపలేదు. ఆమెతోపాటు నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలను టీడీపీ అధిష్టానం విస్మరించింది. గత ఐదేళ్ల కాలంలో అధికార వైఎస్సార్ సీపీ నాయకులతో ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోకపోయినా సొంత పార్టీ నుంచి ఎదురవుతున్న అవమానాలు, ఎన్నికల సమయంలోనూ నియోజకవర్గ ముఖ్య నాయకుడు పట్టించుకోకపోవడాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు. ఎన్టీఆర్‌పై ఉన్న అభిమానంతో పార్టీ ఆవిర్భావం నుంచి, అలాగే నియోజకవర్గం ఏర్పడిన 2009 నుంచి కరడుగట్టిన టీడీపీ నాయకులు, కార్యకర్తలుగా పేరున్న బూదాల అజితారావు వర్గీయులను ఆ పార్టీ ప్రస్తుత ఎమ్మెల్యే అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు దూరం పెట్టడంపై సొంత పార్టీలోనే విస్తృతంగా చర్చ నడుస్తోంది. టీడీపీకి పెద్ద దిక్కుగా ఉన్న రాష్ట్ర టెక్నాలజీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, జిల్లా పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ మన్నే రవీంద్రను సైతం ఎరిక్షన్‌బాబు దూరంగా ఉంచారు.

అలా.. ఎలా?

మండలానికి ఒకరిద్దరు ద్వితీయ శ్రేణి నాయకులను వెంటేసుకొని బడుగు, బలహీన వర్గాలు నివాసముండే కాలనీల్లో రాత్రి వేళల్లో పర్యటించడం, అక్కడ తమ పార్టీవారికే పచ్చ కండువాలు కప్పి వైఎస్సార్ సీపీ కార్యకర్తలు టీడీపీలో చేరినట్లు ప్రకటించుకోవడాన్ని ఎరిక్షన్‌బాబు ఆనవాయితీగా పెట్టుకున్నారు. ఈ బండారం రోజూ బహిర్గతమవుతున్నప్పటికీ ఆయన శైలిలో మార్పురాకపోవడాన్ని టీడీపీ నేతలే తప్పుబడుతున్నారు. రవీంద్ర వర్గానికి చెందిన ప్రముఖ నాయకుడు సైతం ఎరిక్షన్‌బాబుకు దూరంగా ఉండటంతోపాటు రానున్న ఎన్నికల్లో ఆయనకు మద్దతు ఇచ్చే ప్రసక్తే లేదని బహిరంగంగా ప్రకటించారు.

సరె.. సరెలే..

ఇటీవలే టీడీపీ తీర్థం పుచ్చుకున్న మాగుంట శ్రీనివాసరెడ్డి వైపాలెం నియోజకవర్గంపై వేసిన ఎత్తుగడ ఫలించలేదు. అజితారావు తనకు టీడీపీ టికెట్ రాదన్న ఉద్దేశంతో బీసీవై పార్టీలో చేరేందుకు సిద్ధమయ్యారు. ఈ మేరకు యర్రగొండపాలెంలో భారీ ఎత్తున బహిరంగ సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న మాగుంట తన అనుచరులతో ఇన్‌కం ట్యాక్స్ అధికారి అయిన అజితారావు భర్తతో మంతనాలు జరిపారు. వారికి టీడీపీ టికెట్ ఇస్తామని ఆశ చూపినట్లు ప్రచారం జరుగుతోంది. అయినప్పటికీ ఆమె వర్గం వైఎస్సార్ సీపీ వైపే మొగ్గు చూపి ఆ పార్టీలో చేరిపోతున్నారు.

వైఎస్సార్ సీపీలోకి మరికొందరు..

నియోజకవర్గ టీడీపీలో కాస్త పట్టున్న మన్నే రవీంద్ర, అజితారావు వర్గాలకు చెందిన మరికొందరు నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరేందుకు సిద్ధమవుతున్నారు. నియోజకవర్గంలో వివిధ సామాజిక వర్గాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు తమ అనుచరులతో పెద్ద ఎత్తున తాటిపర్తి చంద్రశేఖర్‌ను కలిసి వైఎస్సార్ సీపీ కండువా కప్పుకునేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు.

సీఎం జగన్‌కే ప్రజామోదం

- సిద్ధం సభలతో అది నిరూపితం
- చంద్రబాబు పాలనలో జిల్లాకు ఏం చేశారో చెప్పగలరా?
- టీడీపీ అభ్యర్థులంతా నియోజకవర్గాలకు చుట్టపు చూపుగా వచ్చేవాళ్లే..
- గద్దెనెక్కి ప్రజాధనం కొల్లగొట్టేందుకే చంద్రబాబు పొత్తుల జిత్తులు
- వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ డిప్యూటీ కోఆర్డినేటర్ టీజేఆర్


ఎస్ఎన్ పాడు ఎమ్మెల్యే సుధాకర్‌బాబును సన్మానిస్తున్న తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని నాలుగు ప్రాంతాల్లో నిర్వహించిన ‘సిద్ధం’ సభలకు హాజరైన జనాన్ని చూస్తే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏ స్థాయిలో ప్రజామోదాన్ని పొందారో తెలుస్తుందని ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ డిప్యూటీ కో ఆర్డినేటర్ టీజేఆర్ సుధాకర్‌బాబు పేర్కొన్నారు. సిద్ధం సభకు వచ్చిన వారిలో 25 శాతం మంది కూడా ప్రధానమంత్రి, మాజీ సీఎం, సినిమా యాక్టర్ ముగ్గురూ కలిసి నిర్వహించిన సభకు హాజరుకాకపోవడం వైఎస్ జగన్ అఖండ విజయాన్ని సూచిస్తోందని అభిప్రాయపడ్డారు. గురువారం యర్రగొండపాలెం వచ్చిన టీజేఆర్‌ను వైఎస్సార్ సీపీ అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా టీజేఆర్ మాట్లాడుతూ.. చంద్రబాబు అధికారంలో ఉండగా పశ్చిమ ప్రాంతాన్ని గాలికొదిలేశాడని విమర్శించారు. వెలిగొండ ప్రాజెక్టుకు 2014–19లో బాబు చేసిన ఖర్చు, సీఎం వైఎస్ జగన్ 2019–24 కాలంలో వెచ్చించిన నిధులు ఎంత అనేది ప్రజలకు అవగతమైందన్నారు.

వైఎస్సార్ సీపీ యర్రగొండపాలెం అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్, మార్కాపురం అభ్యర్థి అన్నా వెంకటరాంబాబు, గిద్దలూరు అభ్యర్థి కేపీ నాగార్జునరెడ్డి, కనిగిరి అభ్యర్థి దద్దాల నారాయణయాదవ్ వారం రోజుల నుంచి నీటి ఎద్దడిని పరిష్కరించేందుకు తమ సొంత నిధులు వెచ్చిస్తున్నారని పేర్కొన్నారు. టీడీపీ అభ్యర్థులుగా తెరపైకి వచ్చిన వ్యక్తుల విశ్వసనీయత, క్రెడిబిలిటీని నిశితంగా గమనించాలని ప్రజలను కోరారు. నేర స్వభావం ఉన్నవారు, దోపిడీదారులుగా ముద్రపడిన వారిని ఇంటికి సాగనంపాలని ప్రజలకు పిలుపునిచ్చారు. గుంటూరులో ఆస్పత్రి నిర్వహిస్తున్న ఉగ్రనరసింహారెడ్డి కనిగిరికి ఎన్నికల సమయంలో చుట్టపు చూపుగా మాత్రమే వస్తారని ఎద్దేవా చేశారు. గిద్దలూరు టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి.. తనకు రాజకీయ భిక్ష పెట్టిన వైఎస్సార్ సీపీకే వెన్నుపోటు పొడిచాడని, పార్టీ ఫిరాయించడం ద్వారా తనను ఎన్నుకున్న ప్రజలను మోసం చేశాడని దుయ్యబట్టారు. ముత్తుములను గిద్దలూరు ప్రజలు మరోసారి ఛీకొట్టడం ఖాయమన్నారు. సౌమ్యుడైన మార్కాపురం వైఎస్సార్ సీపీ అభ్యర్థి అన్నా రాంబాబు విజయం తథ్యమన్నారు. యర్రగొండపాలెం అభ్యర్థిగా బరిలో ఉన్న తాటిపర్తి చంద్రశేఖర్ సేవాగుణం, వైఎస్ జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలు ఆయన విజయానికి అండగా నిలుస్తాయన్నారు. వైపాలెంలో వైఎస్సార్ సీపీని ఢీకొట్టే సత్తా టీడీపీకి లేదని చెప్పారు. వైఎస్సార్ సీపీ ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి లక్ష ఓట్ల మెజార్టీతో గెలుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

రానున్న ఎన్నికల కురుక్షేత్రంలో ప్రజలకు మంచి చేసిన సీఎం వైఎస్ జగన్ ఓ వైపు ఉంటే.. మరోవైపు 2014లో గుంపుగా వచ్చి ప్రజలను పీడించుకుతిన్న చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, బీజేపీ నేతలు ఉన్నారని చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వానికి, వైఎస్సార్ సీపీ పాలనకు మధ్య వ్యత్యాసాన్ని బేరీజు వేసుకుని మంచి చేసిన వారిని ఆశీర్వదించాలని కోరారు. మరో ఐదు రోజుల్లో సీఎం వైఎస్ జగన్ తొలివిడత ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తున్నారని, ప్రతి పార్లమెంట్ పరిధిలోని ఒక నియోజకవర్గంలో 1.50 లక్షల మందితో భారీ బహిరంగ సభలు నిర్వహించేందుకు కార్యాచరణ సిద్ధమైందన్నారు. టీడీపీని చిత్తు చిత్తుగా ఓడించటానికి వైఎస్సార్ సీపీ శ్రేణులు సిద్ధంగా ఉన్నాయన్నారు. వైఎస్సార్ సీపీకి మద్దతు తెలిపి ఆదరిస్తున్న కుల సంఘాలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు వెన్నా హనుమారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కె.ఓబులరెడ్డి, పి.కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ ఆళ్ల ఆంజనేయరెడ్డి, గొర్రాలికొండ దేవస్థానం చైర్మన్ దుద్యాల వెంకటరెడ్డి, నాయకులు యేర్వ చిన్న వెంకటరెడ్డి, రావూరి సుబ్బారావు, కొర్రపోలు సుందరరావు, గోరంట్ల కనకారావు పాల్గొన్నారు.

బస్సును ప్రారంభించిన కలెక్టర్


బస్సును ప్రారంభిస్తున్న కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వ విద్యాలయానికి సంబంధించిన కొత్త బస్సును గురువారం ప్రకాశంభవనం వద్ద కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో విశ్వ విద్యాలయం డైరెక్టర్ డాక్టర్ భాస్కర్‌పటేల్, డీన్స్ ఎం రూపాస్‌కుమార్, సురేష్‌బాబు, కో ఆర్డినేటర్ డాక్టర్ డి.రవిచంద్, టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

హత్య కేసులో నలుగురి అరెస్టు

గిద్దలూరు రూరల్: మండలంలోని గడికోట గ్రామ పంచాయతీ పరమేశ్వరనగర్ గ్రామానికి చెందిన పాముల మునెయ్యపై దాడి చేసి ఆయన మరణానికి కారణమైన కేసులో గుండాల అల్లూరయ్య, కొమ్మి రంగనాయకులు, గుండాల ఈశ్వరయ్య, గుండాల ప్రేమ్‌కుమార్‌లను అరెస్టు చేసినట్లు సీఐ వైవీ సోమయ్య తెలిపారు. నలుగురు వ్యక్తులను 20వ తేదీ రాత్రి గడికోట చెక్‌పోస్టు వద్ద అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా జడ్జి రిమాండ్ విధించినట్లు పేర్కొన్నారు. హత్యకు సంబంధించిన వాస్తవ పరిస్థితులపై విచారణ సాగుతుందని, విచారణ పూర్తయిన వెంటనే పూర్తి వివరాలు వెల్లడిస్తామని సీఐ తెలిపారు.

ఉదయం ఉక్కపోత.. రాత్రికి కుండపోత..


పంట పొలాల్లో నిలిచిన నీరు

ఒంగోలు రూరల్: మండలంలోని కొన్ని గ్రామాల్లో బుధవారం అర్ధరాత్రి భారీ వర్షం కురిసింది. పగలంతా ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడగా అర్ధరాత్రి దాటిన తరువాత ఒక్కసారిగా అకాల వర్షం కురిసింది. అకాల వర్షానికి రైతులు నష్టపోయారు. మండలంలో 1600 ఎకరాల్లో శనగ సాగు చేశారు. ప్రస్తుతం శనగ కోత కోసి కుప్పలు పోసి ఉంది. ఈ సమయంలో వర్షం కురవడంతో తడిసి మొలకెత్తే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పొగాకు పంట కూడా వర్షంతో జిడ్డు కారి లో గ్రేడ్ దిగుబడి ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు. మరో వైపు మిరప, మినుము కోత దశలో ఉండగా ఈ వర్షానికి నాణ్యత కోల్పోయి రైతులకు గిట్టుబాటు ధర తగ్గనుంది. వరి ప్రస్తుతం పొట్ట దశలో ఉన్న నేపథ్యంలో కొంతమేర ఆశాజనకంగా ఉండగా..కోతలు కోసిన పంట మాత్రం దెబ్బతినే అవకాశం ఉంది. ఇక ఇటుక రాయి పరిశ్రమకు ఎక్కువగానే నష్టం వాటిల్లింది. ప్రస్తుతం కల్లంలో ఉన్న ఇటుక రాయి తడిచిపోవడంతో ఆ రాయి ఎందుకు పనికిరాదు. అకాల వర్షం వల్ల ఇటుకరాయి తయారీదారులు తీవ్రంగా నష్టపోయారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ రక్షణ


వైద్య కళాశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న మెడికోలు

- రిమ్స్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ఏడుకొండలు
- ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటిన విద్యార్థులు

ఒంగోలు టౌన్: రోజురోజుకూ వాతావరణంలో పెనుమార్పులు సంభవిస్తున్న నేపథ్యంలో పర్యావరణాన్ని పరిరక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాల్సిన అవసరం ఉందని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు పేర్కొన్నారు. కొన్ని మాసాల క్రితం వైద్య కళాశాల నుంచి సస్పెండై గురువారం నుంచి తరగతులకు హాజరైన విద్యార్థులతో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మొక్కలు నాటించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ఊహించని రీతిలో ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయని, ఇదే పరిస్థితి కొనసాగితే మానవాళికి ప్రమాదమని శాస్త్రవేత్తలు తరచూ హెచ్చరిస్తున్నారన్నారు. చెట్ల నరికివేతను నిలువరించి, ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా మొక్కలు పెంచాలని పిలుపునిచ్చారు. రిమ్స్ ఆవరణలో మొక్కలు నాటిన 60 మంది విద్యార్థులను జీజీహెచ్ సూపరెండెంట్ డాక్టర్ భగవాన్‌నాయక్ అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ దుర్గాదేవి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ తిరుమలరావు, హౌస్‌సర్జన్లు రవిశంకర్, అభిజిత్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి


ప్రమాదంలో మృతి చెందిన కృష్ణచైతన్య

దర్శి: ద్విచక్రవాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని చలివేంద్రం గ్రామం వద్ద గురువారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని లంకోజనపల్లి గ్రామానికి చెందిన పోస్టల్ ఉద్యోగి చీర్ల కృష్ణ చైతన్య(32) ద్విచక్రవాహనంపై వెంకటాచలంపల్లి గ్రామం వైపు నుంచి దర్శి వైపు వెళుతున్నాడు. ఆ సమయంలో దర్శి వైపు నుంచి వెంకటాచలంపల్లి వైపు వెళ్లే ఆర్టీసీ బస్సు, ద్విచక్రవాహనం మూలమలుపులో ఢీకొనడంతో కృష్ణ చైతన్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు.

డౌన్ సిండ్రోమ్‌పై అవగాహన అవసరం


డౌన్‌సిండ్రోమ్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్లు

మార్కాపురం: డౌన్‌సిండ్రోమ్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ కిశోర్‌కుమార్, యశ్వంత్ కోరారు. ప్రపంచ డౌన్‌సిండ్రోమ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మార్కాపురంలోని జిల్లా వైద్యశాలలో ఉన్న జిల్లా బాలభవిత కేంద్రంలో గురువారం పిల్లలకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డౌన్‌సిండ్రోమ్ వల్ల పిల్లల్లో ఎదుగుదల లోపిస్తుందని, కళ్లు చిన్నవిగా ఉండటం, చేతి, కాలివేళ్లు పొట్టిగా ఉండటం, ఇతర సమస్యలతో బాధపడతారన్నారు. ఇలాంటి లక్షణాలున్న వారు భవిత కేంద్రానికి వస్తే మంచి చికిత్స అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీఈఐసీ సిబ్బందితో పాటు డాక్టర్ శ్రీహరిరెడ్డి, సైకాలజిస్టు సుబ్బారావు, వెన్షనిస్టు వెంకటరెడ్డి, డెంటల్ హైజెనిస్టు వెంకట కొండయ్య, ఆడియాలజిస్టు అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి

- ఏపీఐఐసీ చైర్మన్ జంకె


మాట్లాడుతున్న జంకె వెంకటరెడ్డి

మార్కాపురం టౌన్: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఏపీఐఐసీ చైర్మన్, జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి పేర్కొన్నారు. గురువారం మార్కాపురం మండలంలోని కోలభీమునిపాడు, కొత్తపల్లి, పెద్దనాగులవరం గ్రామాల్లో పార్టీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మే 13న నిర్వహించనున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మార్కాపురం అసెంబ్లీ అభ్యర్థి అన్నా వెంకటరాంబాబు, ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. జగనన్న ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాయన్నారు. పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు, వారి జీవన ప్రమాణాల మెరుగుదలకు ఆరోగ్య శ్రీ, అమ్మఒడి, వైఎస్సార్ రైతు భరోసా, జగనన్న ఆసరా, చేదోడు తదితర పథకాలు ఎంతో దోహదపడ్డాయని వివరించారు. ఆయన వెంట వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల కొండయ్య, మాజీ ఎంపీపీ అరుణా చెంచిరెడ్డి, కోఆప్షన్ సభ్యులు మహమ్మద్ రఫీ, రమణారెడ్డి, బండి కృష్ణారెడ్డి, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రచార ప్రకటనలు క్షుణ్ణంగా పరిశీలించాలి

- కలెక్టర్ దినేష్‌కుమార్


ఎంసీఎంసీ సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: సాధారణ ఎన్నికల నేపథ్యంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రసారమయ్యే రాజకీయ ప్రచార ప్రకటనలను ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను కచ్చితంగా పాటిస్తూ మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) అనుమతులు ఇవ్వాలని కలెక్టర్ దినేష్‌కుమార్ సూచించారు. క్యాంపు కార్యాలయంలో గురువారం ఎంసీఎంసీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నియమావళిని అనుసరించి రాజకీయపార్టీలు, అభ్యర్థులు వివిధ మాధ్యమాల్లో ప్రచార చేసుకోవాలన్నారు. ముఖ్యంగా మూడు అంశాల గురించి ఎంసీఎంసీ దృష్టి సారించడం కీలకమన్నారు. అనుమతి తీసుకొని ప్రచురించినా, ముందస్తుగా అనుమతి లేకుండా ప్రచురించినా, రాజకీయపార్టీలు ఇచ్చిన ఫిర్యాదులకు చెందిన ప్రింట్, ఎలక్ట్రానిక్ వీడియోలు, సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వాటిని గమనించాలన్నారు. ఆయా ప్రకటనలు, ప్రచార అంశాలు చెల్లింపు వార్తలు, ఎన్నికల కమిషనర్ మార్గదర్శకాల ఉల్లంఘన, ఖర్చుల వివరాలు ఆయా బృందాలకు నివేదికలను అందచేయాలన్నారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు కనీసం 48 గంటల ముందుగా అనుమతి కోరుతూ దరఖాస్తు చేసుకోవాలన్నారు. వచ్చిన దరఖాస్తును ఎంసీఎంసీ క్షుణ్ణంగా పరిశీలించి ధృవపత్రం జారీ చేయాలన్నారు. ప్రసారమైన ప్రకటనల కంటెంట్‌ను నిశితంగా పరిశీలించి అనుమతులు ఇవ్వాలన్నారు. సమావేశంలో స్పెషల్ కలెక్టర్ ఝాన్సీలక్ష్మి, ఎంసీఎంసీ నోడల్ అధికారి అర్జున్‌రావు, జిల్లా ఆడిట్ అధికారి శంకర్‌నారాయణరెడ్డి, ఎంప్లాయిమెంట్ అధికారి భరద్వాజ్, యూత్ కో ఆర్డినేటర్ కమల్, డీపీఆర్ఓ రమేష్, డివిజనల్ పీఆర్ఓ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చెక్‌బౌన్స్ కేసులో జైలుశిక్ష, నష్టపరిహారం

కనిగిరి రూరల్: చెక్‌బౌన్స్ కేసులో ఏడాది జైలుశిక్ష, రూ.2.96 లక్షల జరిమానా విధిస్తూ గురువారం కనిగిరి జూనియర్ సివిల్ జడ్జి కె.భరత్‌చంద్ర తీర్పునిచ్చారు. వివరాల్లోకి వెళితే.. కనిగిరికి చెందిన ఎస్‌కే నాయబ్‌రసూల్ అనే వ్యక్తి ముదిరెడ్డి చలమారెడ్డి దగ్గర రూ.2 లక్షలు అప్పు తీసుకొని బాకీ తాలుకా రూ.2.96 లక్షల చెక్కు ఇచ్చాడు. అయితే ఆ చెక్కు బ్యాంకులో వేయగా బౌన్స్ కావడంతో ఫిర్యాదు చేశారు. విచారణలో జడ్జి నిందితునికి ఏడాది జైలుశిక్ష, రూ.2.96 లక్షల నష్టపరిహారం విధిస్తూ తీర్పు చెప్పారు.